# విడివడని ముడులు

అయ్యంగార్ ఆనందంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నాడు. కొద్ది కాలంలో అదృష్టం ఆయన్ను వెన్నంటింది. రెండు మేడలు కట్టాడు. మూడు సినిమా హాలులు నడిపిస్తున్నాడు. సాయంత్రం చల్లగాలిలో కారు తన సినీమా హాలు దగ్గరకు వస్తూండగా ఒకాయన చేయి అడ్డుపెట్టాడు.

"ఏమండీ! యింత ఆలస్యం చేస్తే మేము వ్యాపారం ఎట్లా చేసేదండీ? మీరూ ఎప్పుడూ యిట్లా చెయ్యనివారు యిప్పుడు ఎందుకు యింత ఆలస్యం!" వచ్చీ రాని తెలుగు మాటల్లో గుజరాతీ సేట్ కొంచెం కోపంగా విజృంభించాడు అయ్యంగార్ మీద.

"అసలు ఏమిటి విషయం?" తాపీగా అడిగాడు అయ్యంగార్.

"మీరు తీసుక్కున్న సరుక్కులకు రెండు వందలు యిస్తానని పది రోజులు కాలేదా?" అన్నాడు గుజరాతి సేట్.

అయ్యంగార్ ముఖం జేవురించింది కోపంతో. తన సినీమా హాలు మేనేజరును ఆ డబ్బు చెల్లించమని ఏనాడో చెప్పినా అతను యివ్వక పోవటం వల్ల యీ అవమానం, అప్రతిష్ట అనుకున్నాడు అయ్యంగార్.

"క్షమించు సేట్ యిప్పుడే మీ సొమ్ము పంపించేస్తా!" అన్నాడు అయ్యంగార్.

గుజరాతీ సేట్ ప్రక్కకు తప్పుకున్నాడు.

తన మేనేజరు తాను చెప్పినా డబ్బివ్వలేదంటే గుజరాతీ సేట్ నమ్మడని అయ్యంగార్ ఆ విషయం చెప్పలేదు. క్రుద్ధుడై కారు ముందుకు పోనిచ్చాడు. అప్పులు చేయడమన్నా, ఖాతాలు ఆలస్యంగా తీర్చడమన్నా అయ్యంగారి కిష్టంలేదు. వ్యాపారం సవ్యంగా జరగాలంటే, యిచ్చి పుచ్చు కోడాలు ఖచ్చితంగా సకాలంలో జరగాలని ఆయన నమ్మకం.

సినిమా హాలులోకి అడుగు పెట్టగానే ఎదురుగా వసంతమ్మ కని పించింది. కారు దిగగానే ఆమె నమస్కారం సరిగా అందుకోకుండా రుసరుసలాడుతూ మేనేజరు గదిలోకి వెళ్ళాడు. మేనేజరును చీవాట్లుపెట్టి, గుజరాతీ సేట్‌కు డబ్బు పంపించాడు తక్షణం అయ్యంగార్. ఆ కోపం తగ్గాక సినీమా హాలు కాంపౌండులోకి వచ్చాడు అయ్యంగార్. తన పెత్తల్లి కూతురు వసంతమ్మ తనకోసం ఎదురు చూస్తోందని.

"ఎంత సేపయింది వచ్చి?" అన్నాడు అయ్యంగార్.

"మేము కనిపిస్తేగా మీకు!" ఒక విసురు విసిరింది ఆమె.

"కాదు...ఏదో చికాకుతో వచ్చాను. అందువల్ల మొదట నీతో మాట్లాడలేకపోయాను".

"అవును...నా మీదే చికాకు—డబ్బు ఆలస్యంగా యిచ్చానని" ఆమె చెప్పింది.

"మీ మీద ఎందుకు చికాకు?...ఆ మేనేజరుమీద..." అయ్యంగార్ సత్యం చెప్పానని సంతోషించాడు.

"ఏదో వంక—మేనేజరు నేనా డబ్బు యిచ్చానని చెప్పాక సంతో షంతో తిరిగి వచ్చి మాట్లాడుతున్నావు...తీసుకెళ్ళిన పైకం ఆలస్యంగా యివ్వడం తప్పే. సమాయానికి సర్దుబాటు కాలేదు."

"పోనీలే మొత్తంమీద యిచ్చేశావుగా"

"మొత్తంమీద యిచ్చేశావులే అంటున్నావు...యివ్వక కాజేస్తా

నని నీ భావం...నువ్వు ఎంత ధనికుడవైనా యిల్లా మాట్లాడ్డం న్యాయం కాదు..."

వసంతమ్మ దిగాలు ముఖం పెట్టింది.

"ఈ వేళ అన్నీ అపార్థాలే,—అవమానాలే!" అనుకున్నాడు అయ్యంగార్. నిష్కల్మషంగా ఆమె డబ్బు యివ్వగలిగినందుకు సంతోషం వెలిబుచ్చినా ప్రతీ చిన్న మాటను అపార్థం చేసుకునే వ్యక్తిని ఏలా సముదాయించాలో అర్థం కాలేదు.

"ఇల్లు కట్టడం తలపెట్టబడి యీ అప్పు కావలసి వచ్చింది...లేక పోతే ఎప్పుడైనా ఏమైనా నిన్ను అడిగానా?" వసంతమ్మ అయ్యంగార్ని నిలదీసి అడిగింది.

"నేనేమీ అపార్థంతో అనలేదమ్మా! నా మాట నమ్మూ! నువ్వు డబ్బు తిరిగి యిస్తావనే నమ్మకం ఉంది నాకు...యిచ్చేశావుగదా అన్నాను అంతే" అన్నాడు అయ్యంగార్.

"మనస్సులో ఏదో పెట్టుకుని మాట మారుస్తున్నావు...అంత మనస్సులో ఏమీ లేకపోతే, మా యింటికి వచ్చి భోంచేసి వెళ్ళు!" వసంతమ్మ అయ్యంగార్ అభిప్రాయాలకు పరీక్ష పెట్టింది.

అయ్యంగార్ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ఆమె ఆహ్వానం మామూలు పరిస్థితుల్లో స్వీకరించేవాడయినా, ఆ రాత్రి తనే విందు చేస్తానని యిద్దరు స్నేహితులను ఆహ్వానించాడు. వారిద్దరూ సినీమాహాలు అతిథుల గదిలో కూర్చుని వున్నారు. అయ్యంగారికి ఏమనాలో అర్థం కాలేదు.

"కాదమ్మా! యీ వేళ కాదు. నా కోసం యిద్దరు స్నేహితులు వేచి వున్నారు. వాళ్ళకీరాత్రి విందు చేస్తానని మాట యిచ్చాను...రేపువస్తాలే!" అన్నాడు అయ్యంగార్.

"అదిగో! ఇదోవంక! వాళ్ళని ఈ రోజు పంపించేసి—ఈ రాత్రి మా యింటికి భోజనానికి రాకూడదా! రావాలని లేదు నీకు. మనస్సులో

నన్ను గురించి అపార్థం చేసుకున్నావు...నా బ్రతుకు ఎప్పుడూ యింతే! ఎంతమంచిగా బ్రతుకుదామన్నా యిట్లాగే అపార్థం చేసుకుంటారు నన్ను" అంటూ కంటతడి పెట్టింది వసంతమ్మ.

అయ్యంగారు నిశ్చేష్టుడైయాడు.

వసంతమ్మను ఎలా సముదాయించాలో అర్థం కాలేదు.

అయ్యంగార్ కోసం నిరీక్షించి, యింకా రారేమో అనుకుని వసంతమ్మ తాను తెచ్చిన అప్పు సొమ్ము మేనేజరుకు యిచ్చి, కాంపౌండులోకి రాగానే అయ్యంగార్ని చూసి నమస్కరించింది. ఆమెను పలకరించకుండా అయ్యంగార్ లోపలికిపోయి తిరిగి మందస్మితంతో రావడంవల్ల, వసంతమ్మ తాను సొమ్ము వాపసు యింకా చేయలేదన్న భావనతో కోపంగా వున్న అయ్యంగార్ తర్వాత మేనేజరు ద్వారా డబ్బు వాపసు సంగతి విని ప్రసన్నుడైనాడని అనుమాన పడింది.

ఈ అనుమానం ఒక విధంగా సడలిపోయేలా లేదు.

అతిథులుగా నిరీక్షిస్తున్న స్నేహితులకు యింకా ఆలస్యం అవడం అయ్యంగార్ భరించలేకున్నాడు.

"మంచిది—రేపు వచ్చి కలుస్తాలే!" అన్నాడు అయ్యంగార్ యింక ఏదో విధంగా ఆ సంభాషణ పూర్తి చేయాలని. వసంతమ్మ కన్నీరు పెల్లుబికింది. ఇది నిజంగా అయ్యంగార్ చేసిన అవమానంగా భావించింది.

తన ఆతిథ్యం తిరస్కరించిన అయ్యంగార్, తన నిజాయితీపై అనుమానం పెంచుకున్నాడని విచారించింది. ఖిన్నురాలై బాధగా నడిచిపోయింది వసంతమ్మ.

అయ్యంగార్ హృదయం కుమిలింది. మంచితనాన్ని కూడా అపార్థం చేసుకునే వ్యక్తుల్ని ఎలా సరిదిద్దాలి! బాధపడ్డాడు అయ్యంగార్.

అతిధులతో చివరకు హోటలుకు వెళ్ళి అయ్యంగార్ మాటల సందర్భంలో యీ కథ స్నేహితులకు చెప్పాడు...అదే ధోరణిలో జరిగిన సంఘటన ఒకటి అతని స్నేహితుడు సత్యం వివరించాడు.

ఒక రోజు బజారులో వ్యాపారం చేసుకుంటూ నడుస్తున్న సత్యానికి వసుంధర కనిపించింది.

"నమస్తే" అంది...

"నమస్తే" అని సత్యం ముందుకు చికాకుగా వెళ్ళిపోయాడు.

ఎప్పుడూ లేని యీ వింత ప్రవర్తన వసుంధరకు విస్మయం కలిగించింది.

కాని సత్యం ఏదో చికాకులో వున్నాడని ఆమె నమ్మలేదు.

మర్నాడు ఫోన్ చేసింది.

సత్యం చాలా పని రద్దీలో వుండి ముభావంగా మాట్లాడాడు.

వసుంధరకు బాధ ఎక్కువయింది. ఒక రోజు హఠాత్తుగా వచ్చి ఏవో మనోకలతలతో సత్యం బాధ పడుతున్న సమయంలో అడిగింది 'నేనేం తప్పు చేశాను... ఎందుకు యీ ముభావం—కోపం!" అని.

"నువ్వేమీ తప్పు చేయలేదు...నాకు ఎన్నో సమస్యలు బాధలు... మళ్ళీ కలుసుకుందాంలే!" అన్నాడు సత్య...ఏవో పనుల రద్దీలో వెళ్ళిపోయాడు యిల్లు విడిచి

వసుంధర కంఠం శోకంతో గద్గదమయింది.

"మగవాళ్ళను నమ్ముకుంటే ఇలాగే ఉంటుంది..." ఆమె నిశ్చయించింది. మర్నాడు వసుంధర తిరిగి ఫోను చేసింది. సత్యం తన చికాకు స్వభావం తగ్గించుకుని కొంచెం సాఫీగా మాట్లాడాడు.

"ఎల్లా వుంది మీ ఆరోగ్యం!"

"బాగానే వుంది"

"ఏదైనా మందు తీసుకో!"

"మీ అభిమానానికి అనేక కృతజ్ఞతలు."

బొంగురుపోయింది ఆమె కంఠం. టెలిఫోన్ బంద్ అయింది—వసుంధరకు కోపం వచ్చిందని తెలిసింది.

అయితే ఒక స్నేహితుడిలాంటి వ్యాపారి తన్ను రెండువేలరూపాయలు మోసం చేసిన బాధతో కోర్టు ఫిర్యాదులో తిరుగుతున్న సత్యాన్ని ఆమె అర్థం చేసుకోలేదు. ఈ విషయం చెప్పి వసుంధరకు బాధ కల్గించడం యిష్టంలేకపోయింది సత్యానికి... ఒకరిని నొప్పించకుండా ఒకరు మసులుకోవాలనే మంచి ప్రవర్తన నుంచి కూడా అపార్థాలు, అసహజ స్వభావాలు సృష్టి అవుతాయనే విషయాన్ని సమర్థించాడు సత్యం.

అయ్యంగార్ అనుకున్నాడు, తనకు యీ విషయంలో ఒక తోడు నీడ స్నేహితుడొకడున్నాడని సంతృప్తి చెందాడు.

మర్నాడు వసంతమ్మను పలకరిద్దామని అయ్యంగార్ వెళ్ళి "భోజనం తిందామని వచ్చానన్నాడు" నవ్వుతూ. వసంతమ్మ భోజనం పెట్టింది.

కాని యిదంతా మనసులో తనమీది అపార్థం కప్పి పుచ్చుకోడానికే అయ్యంగార్ చేస్తున్నాడని బాధ పడింది ఆమె.

ఆమె ముభావ స్వభావం తగ్గలేదు. అయ్యంగార్ ఆమె యిల్లు విడిచి కారు ఎక్కి నిట్టూర్చాడు. లక్షలు గడించిన తనకు వసంతమ్మ తన వద్ద పుచ్చుకున్న అయిదు వందల అప్పు తృణంతో సమానం. అవసరమైతే ఆ సొమ్ము అడగకూడదని కూడా అనుకున్నాడు. అయ్యంగార్, ఆమె అనుమానం పోగొట్టే స్థితి రావడం చాలా కష్టమైపోయింది.

అయ్యంగార్ కారు స్టార్టు చేశాడు...ఎదురుగా వున్న జనం రద్దీ, ముడులు పడిపోయిన అల్లిక దారంలా వుండి, అది దాటుకుని చల్లగాలి పీల్చుకుందామని నదీ తీరానికి పోతే, మబ్బులు అల్లుకున్న ఆకాశంలో నిర్మలత్వం స్తంభించింది.

* * *